WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా
మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో
పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/
జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది.
అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు..
ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**

Facebook.varadhinews

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:32
శనివారం,
05.10.2024



## రేవంత్ మొనగాడు కాదు
# మోసగాడు

- 22 లక్షల మందికి రుణమాఫీ రాలె
- రాహుల్ మెడలు వంచైనా రుణమాఫీ చేయిస్తా
- ఢిల్లీలో రాహుల్ఇంటి వద్ద ధర్నా చేస్తాం
- ఇంతవరకు రైతు డిక్లరేషన్ ఊసే లేదు..
- సీఎం రేవంత్‌పై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు

**వారధి న్యూస్, మహబూబాబాద్:** పది నెలల పాలనలో రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రైతు ధర్నా కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు బంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు చప్పుడు చేయటం లేదని దుయ్యబట్టారు.


**22 లక్షల మందికి రుణమాఫీ కాలేదు**

"మొదటి సంతకం రుణమాఫీ మీద అన్నాడు. డిసెంబర్ 9 అన్నాడు. ఆగస్టు 15 అన్నాడు. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి , భద్రాద్రి, సమ్మక్క సారలమ్మ మీద ఒట్టు పెట్టాడు. రేవంత్‌మొనగాడు కాదు మోసగాడు

2 లో

# ఎర్ర బారిన అడవి
## 36 మంది మావోల హతం

- ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
- తుపాకుల మోతతో దద్దరిల్లిన దండకారణ్యం
- ఏడు గంటల పాటు భీకర పోరు
- యాంటీ మావోయిస్టు ఆపరేషన్‌కు స్పెషల్ టాస్క్‌ఫోర్స్
- భారీగా ఆయుధాలు స్వాధీనం
- ఈ ఏడాది ఇప్పటి వరకు 180 మంది మృతి
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న గిరిజనులు



**వారధి న్యూస్, చర్ల:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి తుపాకీల మోత మోగింది. నారాయణ్‌పుర్- దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 36కు చేరినట్లు పోలీసులు వెల్లడించారు. బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ-నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్‌మాడ్ దండకారణ్యంలోని తుల్‌తులి, నెందూర్ గ్రామాల మధ్య శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎదురు కాల్పులు జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మీడియాకు తెలిపారు. అక్కడ మావోయిస్టులు నక్కి ఉన్నారన్న సమాచారంతో చేపట్టిన ఆపరేషన్‌లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

**బస్తర్ ప్రాంతంలో 180 మందికి పైగా!**

ఈ ఎన్‌కౌంటర్ అనంతరం 30 మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఏకే 47 రైఫిల్, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో అడపాదడపా ఎదురు కాల్పులు కొనసాగుతున్నట్లు ఐజీ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బస్తర్ ప్రాంతంలో 180 మందికి పైగా మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

**17 వేల మంది బలి**

మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి సవాలుగా మారిందని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పటి వరకు 17 వేల మంది బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. 2004-14 వ్యవధితో పోలిస్తే 2014-24 మధ్యకాలంలో నక్సల్స్ సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందని చెప్పారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.



## పెట్టుబడులకు భారత్ స్వర్గధామం

- పరిశ్రమల స్థాపనకు ఇదే సరైన సమయం
- 7 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతున్నాం
- అత్యధికంగా టూ వీలర్లు, ట్రాక్టర్లు తయారయ్యే దేశం మనదే
- ప్రధాని నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు

2 లో

# ధరణి పోర్టల్ రద్దు

- త్వరలో ఆర్ఓఆర్ చట్టం తెస్తాం
- ప్రజల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటాం
- ప్రతి నియోజకవర్గానికి 4,000 ఇళ్లు
- ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డులు
- అర్హతలను బట్టి సంక్షేమ పథకాలు అం దిస్తాం
- ఎల్ఆర్ఎస్‌దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి
- మంత్రి పొంగులేటి ప్రకటన



**వారధి, స్టేట్ బ్యూరో:** ధరణి పోర్టల్, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)పై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం

2 లో



# హైడ్రాకు హైకోర్టు బూస్ట్

- కూల్చివేతలను ఆపలేం
- ఇప్పటికిప్పుడు స్టే ఇవ్వడం కుదరదు
- ఈ నెల 14న తదుపరి విచారణ

**వారధి, స్టేట్ బ్యూరో:** హైడ్రా కూల్చివేతలపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కేఏ పాల్ పిటిషన్‌పై హైకోర్టులో ఈరోజు (అక్టోబర్ 4) విచారణ జరిగింది. ఈ సందర్భంగా జీవో నెంబర్ 99పై స్టే విధించాలని, హైడ్రా కూల్చివేతలను తక్షణమే ఆపాలని కేఏ పాల్

2 లో



## బతుకమ్మ ఆడాలంటే.. కోర్టు అనుమతి కావాలా..?

- లా అండ్ ఆర్డర్‌కు వచ్చిన సమస్యేంటి..?
- సీఎం రేవంత్‌పై ఎంపీ డీకే అరుణ ఆగ్రహం
- భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బీజేపీ బతుకమ్మ సంబరాలు
- సాయంత్రం 6 తర్వాత ఆడొద్దంటూ అడ్డుకున్న పోలీసులు

2 లో

# హైదరాబాద్ విభజన..!

- నాలుగు ముక్కలుగా జీహెచ్ఎంసీ
- 4 మేయర్ స్థానాలను పరిశీలిస్తున్నాం
- రెండు నెలల్లో ఆర్ఆర్ఆర్‌కు టెండర్లు
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన చేస్తాం
- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ మహానగర జనాభా కోటిన్నర దాటిందని జీహెచ్ఎంసీని నాలుగు మేయర్లుగా విభజించి ఎన్నికలకు వెళ్లే అంశం పరిశీలనలో ఉందని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అసోచామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సమిట్‌లో కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ మహానగర రూపు రేఖలు మారిపోతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. దాదాపు 30వేల కోట్ల రూపాయలతో చేపట్టే



2 లో



## క్రీడా రంగంలో తెలంగాణ
# ఆదర్శం కావాలి

- ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలవాలి
- అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావాలి
- గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**వారధి, స్టేట్ బ్యూరో:** క్రీడా రంగంలో తెలంగాణ ఆదర్శంగా ఉండేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా త్వరలోనే పకడ్బందీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలోనే మన పాలసీకి గుర్తింపు రావాలన్నారు. పన్నెండేండ్ల తర్వాత (2036లో) జరిగే ఒలింపిక్ పోటీలను దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం తయారుచేసిన ముసాయిదా పాలసీపై సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రివ్యూలో పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్

2 లో




## నా ఫామ్‌హౌజ్ నేనే కూలుస్తా..

- మా కుటుంబం చట్టాన్ని గౌరవిస్తుంది
- ఆక్రమణలుంటే సొంత ఖర్చులతో తొలగిస్తా
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాల్లేవు
- కావాలంటే అధికారులు కొలతలు వేసుకోవచ్చు
- రేవంత్ రెడ్డికి లేఖ రాసిన కేవీపీ

2 లో

www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్



# హైడ్రాకు హైకోర్టు బూస్ట్

**తరువాయి భాగం**

హైకోర్టును కోరారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పించిన తరువాతే కూల్చివేతలు మొదలు పెట్టాలని వాదనలు వినిపించారు. అక్రమ కట్టడాలు కూల్చివేతలకు 30 రోజులు ముందే నోటీసులు ఇవ్వాలని కోరారు. అయితే ఇప్పటికిప్పుడు కూల్చివేతలు ఆపలేమని హైకోర్టు వెల్లడించింది.

కేఏ పాల్ పిటిషన్‌లో ప్రతివాదులుగా ఉన్న హైడ్రా, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషనపై కౌంటర్ ధాఖలు చేయాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది.

ఇక, తెలంగాణ ప్రభుత్వం ఈఏడాది జూలై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ కట్టడాలను అరికట్టేందుకు హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా నామకరణం చేసి హైడ్రా పరిధిలో చేర్చారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలపై హైడ్రా దృష్టి సారించి ముందుకు సాగుతుంది. హైడ్రా నగరంతో పాటు, శివారు ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేపడుతుంది. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలకు నోటీసులు కూడా జారీ చేస్తుంది.

మరోవైపు హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. హైడ్రాకు విస్తృత అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం కూడా తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన చట్టాన్ని కూడా రాబోయే అసెంబ్లీ సమావేశాలల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలుపాలని ప్రభుత్వం భావిస్తుంది.

# బతుకమ్మ ఆడాలంటే.. కోర్టు అనుమతి కావాలా..?



**వారధి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో బతుకమ్మ ఆడాలంటే.. కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవాలా? అంటూ మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఘాటు విమర్శలు చేశారు. బతుకమ్మ ఆడేందుకు లా అండ్ ఆర్డర్‌కు వచ్చిన ప్రాబ్లమ్ ఏంటని ఆమె ప్రశ్నించారు. హైదరాబాద్ పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకకు డీకే అరుణ హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మహిళలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సాయంత్రం 6 గంటల వరకే భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలకు అనుమతులున్నాయంటూ పోలీసులు నిలిపివేయడంపై డీకే అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక నియంత పోయాడనుకుంటే రేవంత్ ఆయనను మించిన మరో నియంత తయారయ్యాడని ఆమె ఫైరయ్యారు. కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ ఆడుకోవాలంటే పర్మిషన్ తీసుకోవాలా? అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ తెచ్చినోళ్లమని వాళ్లు పోతే.. ఇచ్చింది తామే అని చెప్పుకునే కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఆమె పేర్కొన్నారు. వారు తెలంగాణ సంస్కృతిని గౌరవించే తీరు ఇదేనా? అని డీకే అరుణ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను మించిన నియంతపాలన సాగుతోందని ఫైరయ్యారు. బతుకమ్మ ఆడుకునేందుకు అభ్యంతరం చెప్పే ప్రభుత్వం ఇక్కడ నడుస్తోందంటే సిగ్గుపడాలంటూ చురకలంటించారు. భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుకుంటే తప్పేంటని, ఇలాంటి ఆంక్షలు పెట్టేందుకే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారా? అని ఆమె ఫైరయ్యారు. మిస్టర్ రేవంత్ రెడ్డి తప్పుడు నిర్ణయాలతో అమ్మవారి ఆగ్రహానికి గురికావొద్దంటూ ఘాటుగా హెచ్చరించారు. బతుకమ్మ ఆడితే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేంటని నిలదీశారు. గతంలో కేసీఆర్ భాష సరిగ్గా లేదనుకున్నామని, ఇప్పుడు అంతకంటే అధ్వాన్నంగా రేవంత్ మాటలు ఉన్నాయని విమర్శలు చేశారు. ఇటీవల సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటని, ఆ స్థాయిలో ఉండి మాట్లాడాల్సిన మాటలేనా? అంటూ ఆమె ధ్వజమెత్తారు. రేవంత్ ది నోరా.. మోరా..? అంటూ అరుణ ఫైరయ్యారు.

**మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు దారుణం..**

ఇకపోతే సినీ నటి సమంత, అక్కినేని ఫ్యామిలీపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సరికావని డీకే అరుణ పేర్కొన్నారు. మంత్రి పదవిలో ఉన్న సురేఖ ఇలా మాట్లాడటం అభ్యంతరకరమన్నారు. ఒక రాజకీయ నాయకురాలిగా ఆమె మాటలు ముమ్మాటికీ తప్పేనని చురకలంటించారు. ఒక మహిళ వ్యక్తిగత విషయాలు మాట్లాడటం సరికాదన్నారు. విడాకులు వారి పర్సనల్ మ్యాటర్ అని, దానిపై రాజకీయాలు ఎందుకని నిలదీశారు. కేటీఆర్‌పై కొండాసురేఖ వ్యాఖ్యలు కూడా సరికావన్నారు. రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా.. వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూడటమే తప్పు అని ఆమె అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేయాల్సి వచ్చిందో సురేఖ ఆలోచించుకోవాలని సూచించారు. ప్రభుత్వంలో అధికారిక హోదాలో ఉన్నారంటే మరింత జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. పాలన చేతగాక కాంగ్రెస్ నేతలు రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని డీకే అరుణ మండిపడ్డారు.

# ధరణి పోర్టల్ రద్దు

**తరువాయి భాగం**

తీసుకువస్తామన్నారు. అక్టోబర్ నెలకాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించామని, ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్‌ను గాలికి వదిలేసిందని విమర్శించారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. పూర్తయిన ఇళ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని మంత్రి తెలిపారు. వెంటనే మరమ్మతులు మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4వేల ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు..**

అక్టోబర్ 7తో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతుందని.. అయితే, ఈ పది నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేకపోయామన్నారు. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ఈ దసరాలోపు స్మార్ట్ కార్డులు ఇస్తామన్నారు. అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రుణమాఫీ రైతులందరికీ త్వరలోనే డబ్బులు జమ చేస్తామన్నారు.

**నత్తనడకన సాగుతున్న ఎల్ఆర్ఎస్**

మరోవైపు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం అనుకున్నంత వేగంగా పుంజుకోవడం లేదన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అందుకే, పురపాలక, రెవెన్యూ శాఖలే కాకుండా అవసరమైతే ఇతర శాఖలకు చెందిన సిబ్బందిని కూడా నియమించుకుని దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కొన్ని జిల్లాల్లో నీటిపారుదల శాఖ అధికారులను కూడా దరఖాస్తు పరిశీలన బృందాల్లో నియమించారు. గత నెలాఖరు వరకు సుమారు 4.50 లక్షల దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తియిందని, వాటిలో ఆమోదించినవి 70వేల లోపే ఉన్నట్లు సమాచారం. పలు జిల్లాల్లో ఎల్ఆర్ఎస్ నత్తనడకన సాగుతుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



## రేవంత్ మొనగాడు కాదు

# మోసగాడు

**తరువాయి భాగం**

అని తేలిపోయింది. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చెయ్యి హరీష్‌రావు అని సవాల్ విసిరిండు. రుణమాఫీ అయితే ఎందుకు ఇంత మంది ఇక్కడి ధర్నాకు వచ్చారు..? పాలకుర్తి మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు. మంత్రి తుమ్మలనే చెప్పారు 22 లక్షల మందికి చేశాం. మిగతా వారికి కాలేదు అన్నాడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా చాలా మంది రుణమాఫీ కాలేదని హరీశ్ రావు సర్కార్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతు డిక్లరేషన్ ఏమైంది..?**

"వరంగల్ వచ్చి వరంగల్ డిక్లరేషన్ ప్రకటించారు. భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ. 15 వేలు అన్నారు.. ఇప్పటికీ కాలేదు. రైతు కూలీలు, భూమి లేని రైతులకు పంట బీమా పథకం అన్నారు. అది కూడా కాలేదు. పోడు, అసైండ్ భూములకు యాజమాన్య హక్కులు ఇస్తామన్నారు. అన్ని రకాల పంటలకు 500 బోనస్ అని, ఇప్పుడు సన్నాలకి మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రేవంత్ రెడ్డి దయ వల్ల రాహుల్ గాంధీ మీద నమ్మకం లేకుండా పోతుంది. వరంగల్ రైతు డిక్లరేషన్ ఎందుకు అమలు చేయలేదు" అని హరీశ్ రావు ప్రశ్నించారు. దసరా పండుగ లోపు రైతులందరికీ రైతు బంధు ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులదరికీ రుణమాఫీ చేసేదాకా వదిలిపెట్టమన్నారు.



**రాహుల్ ఇంటి ముందు ధర్నా...**

"రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే రేవంత్ రెడ్డి కనిపించడం లేదా..? అన్ని పంటలకు బోనస్ అని ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తున్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి. డీఏలు ఇవ్వక ఉద్యోగులను మోసం చేస్తున్నారు. అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి అన్యాయమే చేశాడు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచి మీకు రుణమాఫీ అమలు చేయిస్తాం. దసరా తరవాత రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తం. రుణమాఫీ అమలు చేయిస్తాం" అని హరీశ్ రావు కామెంట్స్ చేశారు.

**ఎన్ని కేసులు పెట్టినా వదలం..**

రాష్ట్రంలో కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. 24 గంటలు కాదు 10, 12 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన మీద 300 కేసులు పెట్టారని.. ఇప్పుడు 30 పెట్టారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా రేవంత్ సర్కార్ ను వదిలిపెట్టేదేలేదని స్పష్టం చేశారు. కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేరాలో చెప్పాలన్నారు. ఘన్ పూర్ లో బై ఎలక్షన్ వస్తదని... రాజయ్యను గెలించుకోవాలని కోరారు.

# పెట్టుబడులకు భారత్ స్వర్గధామం



**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**

ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నా భారత్ 7 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పెట్టుబడిదారులు భావిస్తున్నారని చెప్పారు. ఈ అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథాన్ని కొనసాగించే దిశగా పరివర్తన మార్పులు కొనసాగుతున్నాయని చెప్పారు. కౌటిల్య ఆర్థిక సదస్సులో ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం అని అభిప్రాయపడ్డారు.మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగాలు, నైపుణ్యం, సుస్థిరాభివృద్ధి, వేగవంతమైన విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. భౌగోళిక అత్యవసర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రపంచమంతా భారత్ గురించి మాట్లాడుతుందంటే ఆయా దేశాలకు మన దేశం పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలే అందుకు కారణమన్నారు. ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నామని తెలిపారు.

అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు తయారయ్యే దేశం మనదేనని ప్రధాని మోదీ అన్నారు. మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. సంస్కరించు, పనితీరు మెరుగుపరుచు, రూపాంతరం చెందు అనేది తమ ప్రభుత్వం నిత్యం పటించే మంత్రమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మన బలమని పేర్కొన్నారు. భారత అభివృద్ధి కోసం మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం; జీఎస్టీని తీసుకురావడం; దివాలా స్మృతి; గనులు, రక్షణ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం; ఎఫ్‌డీఐ నిబంధనలు సరళీకరించడం వంటివి తమ ప్రభుత్వ విజయాలుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# హైదరాబాద్ విభజన..!

**తరువాయి భాగం**

ఈ ప్రాజెక్టుకు కేంద్రం సాయం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో రీజినల్ రింగు రోడ్డుకు టెండర్లు పిలుస్తామని తెలిపారు. మూసీ సుందరీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసిందని, దీనివల్ల రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లావాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. మూసీ కంటే విషపూరితమైన సబర్మతిని ప్రక్షాళన చేసి మంచినీరు ప్రవహించే విధంగా మార్చారన్నారు.

**మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..**

ఎన్నో పరిశ్రమల నుంచి రసాయనాలతో పాటు మురికి నీరంతా మూసీలోకే వస్తోందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ సుందరీకరణ పూర్తి చేసి తీరుతామని కోమటిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే మూసీ నది ఆక్రమణలపై మార్కింగ్ చేశారని, తాము మరింత ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రాద్ధాంతం చేస్తున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అర్బన్ స్ట్రాటజీస్, పాలసీస్, రెగ్యులేషన్ అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు.

# నా ఫామ్‌హౌజ్ నేనే కూలుస్తా..

- మా కుటుంబం చట్టాన్ని గౌరవిస్తుంది
- ఆక్రమణలుంటే సొంత ఖర్చులతో తొలగిస్తా
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాల్లేవు
- కావాలంటే అధికారులు కొలతలు వేసుకోవచ్చు
- రేవంత్ రెడ్డికి లేఖ రాసిన కేవీపీ



**వారధి, స్టేట్ బ్యూరో:**

మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు.. సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ అజీజ్‌నగర్‌లోని తన ఫామ్‌హౌస్‌లో ఏదైనా భూభాగం ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌లో ఉంటే కూల్చివేయాలని స్పష్టం చేశారు. తమ కుటుంబం చట్టాన్ని గౌరవిస్తుందని.. ఆక్రమణలుంటే తమ సొంత ఖర్చులతో తొలగించే బాధ్యత తీసుకుంటామని కేవీపీ లేఖలో పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదని కేవీపీ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. "ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అంగుళం నిర్మాణం జరిగినా.. ప్రభుత్వంపై భారం పడకుండా 48 గంటల్లో దానిని కూల్చివేసి.. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేస్తామని నేను స్పష్టం చేశాను" అని కేవీపీ వ్యాఖ్యానించారు.

**సరిహద్దులు గుర్తించండి..**

ప్రతిపక్ష నాయకులు, మీడియాకు అనుమతినిచ్చి.. సరిహద్దులను గుర్తించాలని కోరారు. "మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఇది బహిరంగంగా జరగనివ్వండి, ప్రతి ఒక్కరూ గమనించే అవకాశం ఇవ్వండి" అని కేవీపీ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకుడిగా తనకు ఎలాంటి మినహాయింపు వద్దని కేవీపీ స్పష్టం చేశారు. "నాకు చట్టం నుండి ఎలాంటి మినహాయింపులు అక్కర్లేదు. నా పట్ల సాధారణ పౌరుడిలాగా ప్రవర్తించండి. చట్టాన్ని తన పనిని తాను చేసుకోనివ్వండి" అని లేఖ రాశారు.

ఫామ్‌హౌస్ సమస్యను పరిష్కరించడంతో పాటు.. మూసీ నదిని శుభ్రపరిచి, సుందరీకరించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వ చొరవకు కేవీపీ మద్దతు తెలిపారు. తాను రాజ్యసభలో ఉన్న సమయంలో నేరేడుచెర్ల పర్యటనను గుర్తుచేసుకున్నారు. మూసీ జలాల కలుషిత స్థితిని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ప్రయత్నాలను స్వాగతించారు. "మీ నాయకత్వంలోని మూసీ క్లీనప్, బ్యూటిఫికేషన్ ప్రాజెక్ట్‌కు నేను పూర్తిగా మద్దతు ఇస్తున్నాను" అని లేఖలో పేర్కొన్నారు.

మొదటి దశలో క్లీనప్‌ను పూర్తి చేసి, రెండో దశలో సుందరీకరణకు పనులు చేపట్టాలని కేవీపీ సూచించారు. నిబద్ధతతో కూడిన కాంగ్రెస్ కార్యకర్తగా.. పేదలకు నష్టం జరగకుండా.. ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తాను అండగా ఉంటానని కేవీపీ స్పష్టం చేశారు.



## నేడు మన్ననూరులో ప్రజా యుద్ధ నౌక

# గద్దర్ విగ్రహా ఆవిష్కరణ

- -హాజరుకనున్న ఎంపీ మల్లు రవి
- ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:**

జిల్లాలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిషకరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 5:00గం||లకు ఉంటుందని నిర్వహకులు కల్ముల నాసరయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి,సిబియం ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ వస్తున్నారని.విగ్రహా ఆవిష్కరణ ప్రసిద్ధ అంతర్జాతీయ రచయిత కంచె ఐలయ్య విశిష్ట అతిథి, విగ్రహ దాత కొల్లూరి సత్తయ్య, అంబేద్కర్ ఉద్యమ నేత జె బి రాజు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, గాయని విమలక్క, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, గొర్ల ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న గద్దర్ కూతురు వెన్నెల, కౌన్సిలర్ కొల్లూరు భరత్, ప్రధాన వక్త బాల బోయిన సుదర్శన్, పసునూరి రవీందర్ దోమల ఎల్లస్వామి ముద్దునూరి లక్ష్మీనారాయణ నల్లమల్ల కళాకారుడు జక్కగోపాల్ తిరుమల కొండయ్య దాసరి నాగయ్య నల్ల మల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు ఆయన తెలిపారు జిల్లా నలు మూలల నుండి గద్దర్ అభిమానులు ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## క్రీడా రంగంలో తెలంగాణ

# ఆదర్శం కావాలి

**తరువాయి భాగం**

అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోతున్నదని, ఇటీవల ఉనికిలోకి వచ్చిన స్కిల్స్ యూనివర్శిటీ తరహాలోనే ఇది కూడా పబ్లిక్ - ప్రైవేటు భాగస్వామ్యంతో పనిచేస్తుందని వివరించారు. స్వయంప్రతిపత్తితో ఫంక్షనింగ్ అయ్యేలా ప్రత్యేకంగా గవర్నింగ్ బాడీ ఉంటుందని, చైర్మన్ సహా సభ్యులు, కన్వీనర్, మెంబర్ సెక్రటరీ ఉంటారని తెలిపారు. ప్రస్తుతానికి గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ స్టేడియంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ పనిచేస్తుందని, దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్రాంగణంలో ఇప్పటికే వివిధ క్రీడలకు రెడీమేడ్ సదుపాయాలున్నాయని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అధునాతనంగా అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. తొలుత 13 కోర్సుల్లో అడ్మిషన్లు ఉంటాయని వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై అధికారులు ఇచ్చిన వివరాలను స్టడీ చేసిన సీఎం పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా మన రాష్ట్ర క్రీడాకారులను ఈ యూనివర్శిటీ తీర్చిదిద్దాలని, ఆ సంకల్పంతోనే ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లక్ష్యం సాకారమయ్యే విధంగా అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించటం మొదలు వారి చదువులకు ఆటంకం లేకుండా జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన ప్రావీణ్యం నేర్పించే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లన్నీ పరిష్కరించేలా కొత్త పాలసీ ఉండాలన్నారు.

హైదరాబాద్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలను స్పోర్ట్స్ హబ్ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రమ్ లాంటివన్నింటినీ గుర్తించి ఒకే గొడుగు కిందకి తీసుకురావాలన్నారు. స్పోర్ట్స్ హబ్‌లో క్రికెట్, హాకీ, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను పొందుపరుస్తున్నట్లు తెలిపారు. మన ప్రాంతంలో ఉన్న భౌగోళిక పరిస్థితులతో పాటు యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దేశ విదేశాల్లో ఉన్న కోచ్‌లను రప్పించాలని, అక్కడున్న యూనివర్సిటీల సహకారం తీసుకునేలా అవగాహనా ఒప్పందాలను చేసుకోవాలని సూచించారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏ స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకాలకు ఎంత ప్రోత్సాహాన్ని అందించాలి... ఎవరికి ఉద్యోగం ఇవ్వాలి... తదితర మార్గదర్శకాలను ఖరారు చేయాలని ఆదేశించారు. ముసాయిదాకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు చేర్పులను సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడలు, యువజన అభ్యున్నతి శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం ఈ సమావేశంలో పాల్గొన్నారు.






# అద్భుత కళలకు వేదిక శిల్పారామం..

**ఉద్ఘాటన**
**శిల్పారామం అనేది కళలు, సంస్కృతి, మరియు ప్రకృతిని కలుపుకుంటూ ఉన్న ఒక ప్రత్యేక ప్రదేశం. ఇది సందర్శకులకు ఒక అద్భుత అనుభవాన్ని అందిస్తూ, కళాకారులకు వారి కళను ప్రదర్శించే అవకాశం ఇస్తుంది.**

శిల్పారామం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ఒక ప్రసిద్ధి ప్రదేశం. ఇది శిల్ప కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు జాతీయ కళాకారుల ప్రదర్శనలకు ఒక కేంద్రంగా విస్తరించింది. 1992లో స్థాపించబడిన శిల్పారామం, దాని అందమైన వాతావరణం, సాంస్కృతిక రీతులు, మరియు ప్రాచీన కళలు, శిల్పాలు కలిగిన స్థలం.

**ప్రత్యేకతలు**

1. చిత్రకళ: శిల్పారామంలో ప్రదర్శించే మట్టికళ, బొమ్మలు, పెయింటింగ్స్, పునాది కళలు వంటి విభిన్న కళలతో కళాకారులు మరియు సందర్శకులకు ఆకర్షణీయంగా ఉంటుంది.
2. సాంస్కృతిక కార్యక్రమాలు: వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత, నాట్యం, నాటికలు, మరియు హస్త కళల ప్రదర్శనలు నిర్వహించబడుతాయి. ఇవి ప్రదేశానికి జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పిస్తాయి.
3. స్థలాన్ని సందర్శించేవారికి అనువుగా: కుటుంబాలు, విద్యార్థులు, మరియు పర్యాటకులు ఇక్కడ వచ్చి ఈ కళలను చూడటానికి, కొనుగోలు చేయడానికి, మరియు స్థానిక భోజనాలను ఆనందించడానికి ఒక మంచి గమ్యం.
4. సంగ్రహాలు: ఈ ప్రదేశంలో ఉన్న కళా సంపదలు మరియు ప్రదర్శనల ద్వారా శిల్పారామం, తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన శిల్ప కళలు మరియు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది.
5. వాణిజ్య కార్యక్రమాలు: స్థానిక కళాకారుల ఉత్పత్తులను విక్రయించడానికి మరియు ప్రదర్శించడానికి ప్రత్యేక మేళా కూడా నిర్వహించబడుతుంది, ఇది కళలు మరియు వాణిజ్యం రెండింటికీ ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

**సందర్శన సమయం**

శిల్పారామం రోజువారీగా సందర్శకులకు తెరచి ఉంటుంది, ప్రత్యేకమైన పండుగలు మరియు వేడుకల సమయంలో ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.

















విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రత్యేక గీత ఆవిష్కరణ

**వారధి న్యూస్, తుంగతుర్తి:**బతుకమ్మ పండుగ సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ మండల నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి సారథ్యంలో రూపొందించిన ప్రత్యేక గీతాన్ని, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ గురువారం ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని ఉట్టిపడేలా చేసిన బతుకమ్మ పాటను రూపొందించిన ఝాన్సీ రెడ్డిని మరియు ఆమె బృందాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తప్పట్ల శంకర్, ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న, పట్టణ అధ్యక్షులు ఉప్పుల రాంబాబు యాదవ్, సుంకరి జనార్ధన్, దాసరి శ్రీను, బొంకూరి నాగయ్య, మూరగుండ్ల వీరయ్య, కలకోట్ల మల్లేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సంగాల చెరువులో చేపపిల్లలను వదిలిన ఎమ్మెల్యే

**వారధి న్యూస్, గద్వాల:**గద్వాల మండలం సంగాల రిజర్వాయర్‌లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు ఉచితంగా చేపపిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారిణి షకీలా భాను, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్న కానిస్టేబుల్ కృష్ణయ్య సస్పెండ్




**వారధి న్యూస్, గద్వాల:**అయిజ మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న కానిస్టేబుల్ కృష్ణయ్యను జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావ్ సస్పెండ్ చేశారు. డిపార్ట్మెంట్‌లో ఎవరైనా అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయకుండా అక్రమార్కులకు అండగా ఉంటే సహించేది లేదని ఆయన స్పష్టంచేశారు.పోలీసు శాఖలో అలాంటి వారిపై ఎప్పటికీ నిఘా ఉంటుందని, కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసులకు ఎస్పీ టి శ్రీనివాస్ హెచ్చరికలు జారీచేశారు.




## శిల్పారామంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు

- **చేనేత చీరల ప్రదర్శన**

**వారధి న్యూస్, శేరిలింగంపల్లి:**శిల్పారామం మాదాపూర్‌లో శనివారం నుండి "సారీస్ అఫ్ ఇండియా" బతుకమ్మ మరియు దసరా ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఈ ఉత్సవంలో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత చీరలను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఉదయం 10:30 నుండి రాత్రి 8:00 గంటల వరకు శిల్పారామం ఆవరణలో పోచంపల్లి, గద్వాల్, కోట, కాశ్మీరీ సిల్క్, బెంగళూరు సిల్క్, జాంధానీ, తస్సార్, మస్లిన్, బెంగాలీ కాటన్ మరియు సిల్క్ వంటి చీరలు అందుబాటులో ఉంటాయి.ఈ ఉత్సవానికి సహకరించిన సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగపూర్ వారు మూడు రోజుల డివిషనల్ ఫోక్ ఆర్ట్స్ ఫెస్టివల్ శుక్రవారం ముగింపు ఉత్సవాన్ని నిర్వహించారు.ఉత్సవంలో బతుకమ్మ కామేశ్వరి, కరీంనగర్, రమేష్ చెక్క భజన, తాండూర్, కుష్ణాపల్లి కుమార్ లంబాడి నృత్యం, ఆదిలాబాద్, వెంకటేశ్వరా సురభి థియేటర్ శేరిలింగంపల్లి, నల్లమోలు శ్రీలక్ష్మి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో "నవ దుర్గ స్తోత్రం" నృత్య రూపకముతో అలరించింది.అలాగే, శిల్పారామం మహిళా సిబ్బంది సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆటను ఆడారు, ఈ కార్యక్రమం మొత్తం సాంస్కృతిక సమ్మేళనంగా మారింది.

## జనగామ జిల్లా లో నాలుగు పాడి గేదెలు మృతి

- **అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుండి నీళ్లు వదలడంతో కొట్టుకుపోయిన గేదెలు బోరున విలపించిన రైతులు**



**వారధి న్యూస్, జనగామ :** జనగామ జిల్లా లో అశ్వారావుపల్లి రిజర్వాయర్ నుండి గత రెండు రోజులుగా నీరు విడుదల చేశారు. గత రెండో తారీకు నుండి బతుకమ్మ సంబరాల దృశ్య ఎక్కువ విడిచి పెట్టడం వలన, వాటర్ ఫ్లో వెంగంగా అక్కడి నుండి ఖిల్లాషాపూర్ జనగామ ఉడుముల హాస్పిటల్ మీదుగా నల్గొండ కు కెనాలో ప్రవహిస్తున్న నీరు.జాపర్ గూడెం కు చెందిన రైతులు కావటి మహేందర్ వారి యొక్క గేదెలు దాహం కోసం అక్కడికి వెళ్లగా, కెనాల్లో జారీ పాడి గేదెలు కొట్టుకొని పోయాయి. అందులో ఆరు జారీ పడగ నాలుగు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి ఇంకా రెండు గేదెలు పరిస్థితి విషమంగా ఉందని బోరున విలపించారు.

# అంగన్వాడీ వర్కర్ల హక్కుల కోసం పోరాటం



**వారధి న్యూస్, మిర్యాలగూడ:**అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం, స్థానిక సోమనాథ్ ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆయన అంగన్వాడీ వర్కర్లకు వేతనం 18,000 రూపాయలు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే, అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని, కనీస వేతనం 18,000 రూపాయలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్గాలకు 2 లక్షలు, సాధారణ ఉద్యోగులకు 1 లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వాటిని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అంగన్వాడీలను సర్వేల పేరిట వెట్టిచాకిరి చేయించుకోవడం, ఇచ్చే అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న అంగన్వాడీలు అనారోగ్య పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రిపోర్టుల పేరిట వేధిస్తున్నారని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు.ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తున్నట్లుగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో, అంగన్వాడి కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ హామీలను అమలు చేయించేందుకు బలమైన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం, నూతన కమిటీని ఎన్నుకున్నారు:

**అధ్యక్షురాలిగా: బొందు పార్వతి**
**ప్రధాన కార్యదర్శిగా: సైదమ్మ**
**ఉపాధ్యక్షులుగా: మంగ్లీ, స్వరాజ్యం, రాధాబాయి**
**సహాయ కార్యదర్శులుగా: తుడి అరుణ, మహేశ్వరం ప్రమీల, విజయలక్ష్మి**
**ప్రచార కార్యదర్శిగా: శోభ**
**కోశాధికారిగా: రషీదా**

ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్రెడ్డి, మరియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.




## ఉచిత వైద్య, ఆరోగ్య శిభిరం

- **ఆరోగ్య నియమాలు పాటించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆహ్వానం**

**వారధి న్యూస్, భువనగిరి:**వైద్యుడు దేవుడితో సమానమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికారులు అధ్యక్షులు ఎ. జయరాజు అన్నారు. శుక్రవారం, జిల్లా న్యాయ సేవ అధికారులు, భువనగిరి న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బీబీ నగర్ ఎయిమ్స్ వైద్యశాల సహకారంతో జిల్లా కోర్టు ఆవరణలో ఉచిత వైద్య, ఆరోగ్య శిభిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి సమాజంలో సరైన ఆహార నియమాలు లేకుండా, పని వత్తిడి, వ్యాయామం లేమి వంటి కారణాల వల్ల మనుషులు అనేక రుగ్మతలకు గురవుతున్నారని జయరాజు తెలిపారు. అనారోగ్యానికి గురైనప్పుడు మాత్రమే వైద్య చికిత్సకుకు పోకుండా, ఆరోగ్య నియమాలు పాటిస్తే, శరీరం మరియు మనస్సు సరిగ్గా పనిచేస్తాయని, తద్వారా దైనందిన జీవన పోరాటం సులభమవుతుందన్నారు.న్యాయ సేవ అధికార చట్టం లక్ష్యాలలో ప్రతి ఒక్కరికి రాజ్యాంగ ఫలాలు అందించాలని, ఈ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య, ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడమైనదని వివరించారు.ఈ శిబిరంలో మొత్తం 134 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. హరినాథ్ మరియు ఎయిమ్స్ ఆసుపత్రి స్టాండింగ్ కౌన్సిల్ వేముల అశోక్ మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలు వైద్య సేవలే కాకుండా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తాయని చెప్పారు. ఎయిమ్స్ డాక్టర్లు వాహిణి మరియు చంద్రమౌళి, గ్రామాలు, పట్టణాలు, కమ్యూనిటీ కేంద్రాలలో సంస్థ అధికారుల సూచనల మేరకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి. మాధవిలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. కవిత, ఎయిమ్స్ వైద్య బృందం, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె. జయ, ముఖ్యకార్యదర్శి కె. కృష్ణ, ట్రెసరర్ జె. శివకిరణ్, న్యాయవాదులు, పోలీసుల మరియు కక్షిదారులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**వారధి న్యూస్, మిర్యాలగూడ:** ఆటో రిక్షా డ్రైవర్లు, ఓనర్లు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో పోలీస్, ఆర్టీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ఆటోలను నడపాలని సూచించారు. రోడ్లపై, బస్ స్టాండ్ ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ ఆటోలను ఆపకుండా, సరైన స్థలాల్లోనే ఆపాలని కోరారు.అదనంగా, బస్ స్టాండ్ లోపల ఆటోలను నిర్బంధంగా ఆపకుండా, మధ్య గేట్ వద్ద మాత్రమే ప్రయాణికుల కోసం నిలిపి ఉంచాలని చెప్పారు. ఆటోల్లో అతిగా ప్రయాణికులను ఎక్కించకుండా, గరిష్ట లోడ్ పరిమితిని పాటించాలని హెచ్చరించారు. ఆటోల్లో శబ్ద కాలుష్యం చేసే సౌండ్ సిస్టమ్‌లను ఉపయోగించకూడదని స్పష్టం చేశారు.నిబంధనలను ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాజశేఖర్ రాజు హెచ్చరించారు.కార్యక్రమంలో ఒన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్లు కోట కరుణాకర్, పి. నాగార్జున, టూ టౌన్ ఎస్ఐ రాంబాబు, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ బాబు, మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ జి. రాంమోహన్రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) డి. భారతిబాయి, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) యాదగిరి, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ జానకిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఫేక్ ల్యాండ్ డాక్యుమెంట్ల ముఠా అరెస్టు

**వారధి న్యూస్, కుత్బుల్లాపూర్:** జీడిమెట్ల పోలీసులు ఫేక్ ల్యాండ్ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని సొమ్ము చేసుకుంటున్న ముఠాను అరెస్టు చేశారు. బాలానగర్ డీసీపీ సురేష్ మాట్లాడుతూ, ప్రధాన నిందితురాలు పద్మజా రెడ్డి అనే పార్టీ నాయకురాలితో కలిసి మరికొంతమందితో కలిసి చనిపోయిన వ్యక్తులను బతికినట్లుగా చిత్రీకరించి, వారి భూములపై నకిలీ డాక్యుమెంట్లు తయారుచేస్తున్నట్లు తెలిపారు.ఈ ఘటనపై ఎల్. సురేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుతుబుల్లాపూర్, సుభాష్ నగర్ ప్రాంతాల్లో దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో, నకిలీ డాక్యుమెంట్ల తయారీకి ఉపయోగించిన ఫోటోషాప్, పాత పేపర్‌ల పై ప్రింట్ చేయడం వంటి దారులను గుర్తించారు.నిందితులలో పద్మజా రెడ్డి, కరుణాకర్ మరియు ఇతరులు ఉన్నారు. ఈ కేసులో నకిలీ పత్రాలు, జంపింగ్ ట్రోట్ వంటి వస్తువులను సీజ్ చేశారు. గతంలో వీరిపై రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ స్టేషన్లలో వివిధ కేసులు ఉన్నాయని డీసీపీ తెలిపారు.ముఠాపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## మంజీరా రోడ్డు నిర్మాణానికి 4.31 కోట్ల ఆర్థిక సహాయం



**వారధి న్యూస్, శేరిలింగంపల్లి:**నియోజకవర్గం పరిధిలోని మంజీరా రోడ్డు నిర్మాణ పనులకు 4 కోట్ల 31 లక్షల 50 వేల రూపాయల అంచనాతో చేపట్టబోతున్నట్లు పిఎసి చైర్మన్ మరియు ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మునుపు ప్రత్యేక చొరవతో రూ. 40 కోట్లతో మంజీరా మంచినీటి కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు 4 కోట్ల 31 లక్షల 50 వేల రూపాయలతో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శనివారం శంకుస్థాపన జరగనుంది" అని చెప్పారు.హాఫీజ్పేట్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ, కార్పొరేటర్ పూజిత జగదీష్వర్ గౌడ్ మరియు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం జరగనుంది.

**ప్రారంభోత్సవం యొక్క ముఖ్యమైన పనులు:**

**1. హాఫీజ్ పేట్ ఓవర్ నుండి విజేత సూపర్ మార్కెట్ వరకు**
**అంచనా వ్యయం: ₹197 లక్షలు**
**నిర్మాణం: సీసీ రోడ్డు**

**2. విజేత సూపర్ మార్కెట్ (వైశాలి నగర్) నుండి మై హోమ్ జెవెల్ వెనుక గేట్ వరకు**
**అంచనా వ్యయం: ₹195 లక్షలు**
**నిర్మాణం: సీసీ రోడ్డు**

**3. RTC కాలనీ నుండి జాతీయ రహదారి వరకు మురళీధర్ సొసైటీ రోడ్డు**
**అంచనా వ్యయం: ₹39.50 లక్షలు**
**నిర్మాణం: సీసీ రోడ్డు**

**హాఫీజ్పేట్ డివిజన్ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.**



## నాటు సారాయి తయారీపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్త తనిఖీలు

**వారధి న్యూస్, తుంగతుర్తి:** మద్దిరాల మండలం మామిళ్ళ మడవ గ్రామంలో, పోలీసులు మరియు ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో నిషేధిత నాటు సారాయి తయారుచేస్తున్న వారిపై కేసులు నమోదయ్యాయి.ఈ తనిఖీల సందర్భంగా, మామిళ్ళ మడవ గ్రామ పరిధిలోని తండాలలో నిషేధిత సారాయిని తయారీకు అవసరమైన నల్లబెల్లం మరియు ఇతర వస్తువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు స్పష్టంచేశారు. మద్దిరాల ఎస్సై వీరన్న మాట్లాడుతూ, ఈ చర్యలు కొనసాగుతాయని, అక్రమ సారాయి తయారీలో పాలుపంచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.ఈ తనిఖీలలో తుంగతుర్తి సీఐ శీను నాయక్, తుంగతుర్తి ఎక్సైజ్ ఆఫీసర్ మూర్తి, సూర్యపేట టౌన్ ఎక్సైజ్ ఆఫీసర్ సురేంద్ర బెనర్జీ, మరియు జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.



# 78 మంది జల సమాధి

**కాంగోలో ఘోర ప్రమాదం**
**కివు సరస్సులో పడవ బోల్తా**

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
మిడిల్ ఆఫ్రికా దేశమైన కాంగోలోని కివు సరస్సులో మరో ఘోర ప్రమాదం జరిగింది. పడవ బోల్తా పడిన ఘటనలో 78 మంది మరణించారు. ప్రమాదం జరిగే సమయంలో పడవలో 278 మందికి పైగా ఉన్నారని దక్షిణ కివు ప్రావిన్స్ గవర్నర్ జీన్‌జాక్వెస్ పురుస్సీ వెల్లడించారు. ఈ ప్రమాదంలో 78 మంది మరణించారని.....మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ ప్రమాదానికి ఓవర్ లోడ్ కారణం అని తెలుస్తోంది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని మినోవా పట్టణం నుంచి గోమా పట్టణానికి వెళ్తుండగా గోమా తీరానికి కేవలం 100 మీటర్ల దూరంలో ఈ పడవ బోల్తా పడింది.

నీటిలో మునిగిన పడవ

మిడిల్ ఆఫ్రికా దేశం తూర్పు కాంగోలోని కివు సరస్సులో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. సామర్థ్యానికి మించిన ప్రయాణికులతో వెళ్తున్న పడవ ఒక్కసారిగా బోల్తా పడింది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని మినోవా పట్టణం నుంచి గోమా పట్టణానికి 278 మందితో పడవ బయలుదేరింది. అయితే గోమా తీరానికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉండగా ఓవర్ లోడ్ కారణంతో ఈ పడవ ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో 78 మంది జల సమాధి అయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ విషాద సంఘటన గురువారం నాడు జరిగినట్లు దక్షిణ కివు ప్రావిన్స్ గవర్నర్ జీన్‌జాక్వెస్ పురుస్సీ వెల్లడించారు. పడవ సామర్థ్యానికి మించి ప్రయాణికులు ప్రయాణించడంతోనే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. గురువారం నాడు ప్రమాదం జరగ్గా ఇప్పటి వరకు 50 మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికితీసినట్లు తెలిపారు. ఒక 10 మంది ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డారని వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. రెస్క్యూ చేసి సుమారు 50 మందిని రక్షించినట్లు వెల్లడించారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com



# ఫోటోగ్రాఫర్లు చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయం

- ఫోటో స్టూడియో లకు ఇన్సూరెన్స్ చేసి ఉంచండి
- చెడు మార్గంలోకి వెళ్లి కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టకూడదు
- బ్యాంకు లోన్లు అందించేందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తా
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఉండే ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ తరపున చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఫోటోగ్రాఫర్ల అభ్యున్నతికి తాను ఎల్లవేళలా సహకరిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను mla శుక్రవారం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫర్స్ అందరికీ వారి ఫోటో స్టూడియోలకు ఇన్సూరెన్స్ చేసుకుని ఉండాలని దాంతో ఏదైనా ప్రమాదం సంభవించిన కుటుంబాలకు ఇబ్బంది ఉండదని ఆయన సూచించారు.ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొనే ఫోటోగ్రాఫర్లలో అవసరం ఉన్నవారికి బ్యాంకు రుణాలు సైతం మంజూరు చేయించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే ఫోటోగ్రాఫర్లకు భరోసా కల్పించారు.వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఫోటోగ్రాఫర్ లందరికీ కావలసిన కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కావలసిన స్థలాన్ని సైతం సమకూర్చేందుకు తాను ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి క్రీడలలో ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ పాల్గొనాలని, క్రీడలు ఆడడం వలన దేహదారుఢ్యం సమకూరుతుందని పేర్కొన్నారు.చెడు వ్యసనాలను దరిచేరనివ్వకుండా ఉండాలని ఎవరు కూడా చెడు మార్గంలో వెళ్లి కుటుంబాలను ఇబ్బందుల్లోకి పెట్టకూడదని ఆయన ఫోటోగ్రాఫర్లకు సూచించారు.అనంతరం ఆయన క్రీడాకారులతో పాటు క్రికెట్ ఆడి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పట్టణ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి రూపంలో ఎరుపు రంగు చీరలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా గంజి జగదీశ్, మాకం మహేష్, మాకం వెంకటేష్ దంపతులు ముల విరాట్ విగ్రహానికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు కుంకుమార్చన చేసి, బతుకమ్మలు ఆడారు. ఆలయానికి వచ్చిన భక్తులు భక్తులు హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వనం పర్వతాలు, ధనరాజ్, రాములు, వేణు, నారాయణ, నర్సింహ, మల్లయ్య, మహిళ సంఘం అధ్యక్షురాలు శకుంతల, గీత, హైమావతి లు పాల్గొన్నారు.



## బ్రహ్మచారిని అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** శ్రీశైల ఉత్తర ద్వారమైన చెందినశ్రీ ఉమామహేశ్వర పుణ్యక్షేత్రంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈ ఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనం

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణ అమ్మవారు దర్శనమిచ్చారు దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన అనంతరం హోమం నిర్వహించారు ఉత్సవంలో భాగంగా మొదటి రోజు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా కళ్యాణం నిర్వహించారుఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొరివి చంద్రశేఖర్ దంపతులు. పాపిశెట్టి బాలరాజు దంపతులు. కామిశెట్టిశ్రీనివాసులు దంపతులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు నరేష్ యాదవ్

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగవరం గ్రామంలో మెగా రక్తదాన శిభిరం ప్రారంభించారు. ఈ రక్తదానం శిబిరంలో యువకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేసారు. దాదాపు 60యునిట్ల రక్త నిల్వాలు సేకరించము అని నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు నరేష్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

**వారధి న్యూస్, కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ను శుక్రవారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి, సిబ్బంది పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలంటూ సూచనలు చేశారు. గంజాయి, అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణాపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని, అలాగే స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణ సాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై అన్వేష్ రెడ్డి, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






## షరతులు లేకుండా రుణమాఫీ ఇవ్వాలి

- తొర్రూర్ ధర్నా లో పాల్గొన్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

**వారధి న్యూస్, తొర్రూర్ / మహబూబాబాద్:** పాలకుర్తి నియోజకవర్గంలో, బీఆర్ఎస్ ఇంచార్జ్ మరియు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావ్ ఆధ్వర్యంలో తొర్రూర్ పట్టణ కేంద్రంలో రుణమాఫీ ధర్నా జరిగింది. ఈ ధర్నాలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రైతులకు షరతులు లేకుండా వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావ్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ మధుసూదన చారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపాలకుర్తి మండల నాయకులు, ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గూడా దామోదర్, మరియు బిఆర్ఎస్ మండల పార్టీ సంయుక్త కార్యదర్శి దొంతమళ్ళ గణేష్, లకావత్ వెంకటేష్, లకావత్ నాగరాజు, శ్రీకాంత్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఉప్పల్ టీ20 క్రికెట్ మ్యాచ్ కోసం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- రాచకొండ సీపీ సుధీర్ బాబు

**వారధి న్యూస్, మల్కాజిగిరి:** ఈ నెల 12న ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగనున్న టీ20 క్రికెట్ మ్యాచ్ కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. స్టేడియంలో భద్రతా సమీక్షను నిర్వహించేందుకు సీపీ సుధీర్ బాబు, డీసీపీలు, ఏసిపిలు, జిహెచ్ఎంసి, ఫైర్, ఎలక్ట్రిసిటీ శాఖ ప్రతినిధులు, హైదరాబాదు క్రికెట్ అసోసియేషన్ (HCA) సభ్యులతో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలో మ్యాచ్ నిర్వహించడం గొప్ప అవకాశం అని, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు. టికెట్ల పంపిణీలో గందరగోళం లేకుండా పారదర్శక విధానాలు పాటించాలని, నకిలీ టికెట్లు అమ్మేవారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.మ్యాచ్ సందర్భంగా ట్రాఫిక్ జామ్‌లు నివారించేందుకు, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సుధీర్ బాబు అధికారులకు ఆదేశించారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రతి కదలికను నిశితంగా గమనిస్తామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో డీసీపీ మల్కాజిగిరి పద్మజ, హెచ్‌సిఎ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు, వైస్ ప్రెసిడెంట్ దల్జీర్ సింగ్, ఎస్ఓటి డిసిపి రమణారెడ్డి, విమెన్ సేఫ్టీ డిసిపి ఉషా విశ్వనాథ్, డీసీపీ ఎస్బి కరుణాకర్, డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## కురుమూర్తి స్వామి దేవస్థాన పాలకమండలి సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన పాలకమండలి సభ్యులను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తన స్వగృహంలో శాలువాలతో సన్మానించారు. రాబోయే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాలకమండలి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గవినోళ్ల గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సహా పలువురు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలో డీజే వినియోగం నిషేధం



**వారధి న్యూస్, వనపర్తి:** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, వనపర్తి జిల్లా పరిధిలో మతపరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై నిషేధం విధిస్తూ జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఐఏఎస్, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. డీజే సౌండ్ సిస్టమ్స్ నుంచి అధిక డెసిబెల్ శబ్దాలు ఉత్పన్నమవుతుండటంతో హృద్రోగులకు గుండెపోటు, చిన్నపిల్లలకు శాశ్వత వినికిడి సమస్యలు, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ కారణాలతోనే నిషేధం అమలు చేయాలని నిర్ణయించామని అధికారులు తెలిపారు.డీజేలు, యాంప్లిఫయర్లు, మరియు బాణాసంచా వాడటం ఇకపై ఊరేగింపుల్లో అనుమతించబోదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే భారత దండన చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఐదేళ్ల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధిస్తామని ఎస్పీ తెలిపారు.ఈ ఉత్తర్వులు ప్రజలకు, అధికారులకు కలిగే ఇబ్బందులను విశ్లేషించి తీసుకున్న నిర్ణయమని, పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్, ఎస్పీ తెలిపారు.



## నక్సలైట్ పేరుతో 50 లక్షలు డిమాండ్

- పోలీసుల అదుపులో నిందితుడు
- మొబైల్ ఫోను, 6 వేలు స్వాధీనం
- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్

**వారధి న్యూస్, వనపర్తి:** ధనవంతులుగా మారాలనే దుర్బుద్ధితో నక్సలైట్ అవతారమెత్తి అమాయకులను బెదిరించి పోలీసులకు పట్టుబడిన సంఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకుంది. శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, మామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్ రెడ్డి అలియాస్ ప్రమోద్ రెడ్డి అనే వ్యక్తి, తాను మాజీ నక్సలైట్ నని చెప్పి, వనపర్తి జిల్లా సోలిపూర్ గ్రామానికి చెందిన రైస్ మిల్ యజమాని తేనేటి శేఖర్ రెడ్డికి ఫోన్ చేసి, 50 లక్షలు డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించడంతో, శేఖర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు సాంకేతిక సహాయం పొందుతూ నిందితుడిని ఖిల్లాఘనపూర్ బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సుదర్శన్ రెడ్డి తన నేరాన్ని అంగీకరించాడు. గతంలో కూడా ఇలాగే పలు చోట్ల డబ్బులు డిమాండ్ చేసి ప్రజలను బెదిరించి నేరాలు చేసినట్లు తెలిసింది.ఈ కేసును చాకచక్యంగా పరిష్కరించిన ఖిల్లాఘనపూర్ ఎస్సై సురేష్, కొత్తకోట సీఐ రాంబాబు, పోలీసులు జిల్లాలో ప్రశంసలు పొందారు.




## వనపర్తి పోలీసులకు బంగారు పథకాలు

- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ కార్యాలయం పరేడ్ మైదానంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న జోగులాంబ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ వనపర్తి జిల్లా ఏ హెచ్ టి యు ఎస్సై ఎండి.అంజద్ కు శాస్త్రీయ పరిశోధన ప్రాక్టీస్ లో బంగారు పతకం వరించింది. అదేవిధంగా వనపర్తి జిల్లా వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్ కు సన్నివేశ చిత్ర సంగ్రహణ లో బంగారు పతకం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. శుక్రవారం రోజు మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ మైదానంలో బంగారు పథకాలు సాధించిన వీరిద్దరికీ జోగులంబ జోన్ డి. ఐ. జి. ఎల్ ఎస్ చౌహాన్ ఐపీఎస్ పథకాలను అందజేశారు. బంగారు పతకాలు సాధించిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.వనపర్తి జిల్లాకు రెండు బంగారు పథకాలు సాధించడం జిల్లా పోలీసుల గర్వకారణమని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. పథకాలు సాధించిన ఎస్సై ఎండి.అంజద్, కానిస్టేబుల్ రాజశేఖర్ లను జిల్లాలోని పోలీస్ లు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.



## నూతన తాసిల్దార్ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** చిన్న చింతకుంట మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ ఎల్లయ్య ను శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తమ సేవలను నిరంతరం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటేష్, బాలవర్ధన్, వెంకటేష్ వట్టెం, శివకుమార్, శేఖర్, అశోక్, జయరాజు, సామ్సన్, కృపాకర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వారధి న్యూస్, వికారాబాద్:** రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం కప్ 2024 నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం క్రీడాకారులు మరియు యువతలో అవగాహన పెంచేందుకు కలెక్టరేట్ కార్యాలయం నుండి టార్చ్ రిలే ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ర్యాలీని 3 అక్టోబర్ 2024న ప్రారంభించారని, ఈ ర్యాలీ ఇప్పుడు వికారాబాద్ జిల్లా చేరుకోవడంతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి ర్యాలీని ప్రారంభించడం జరిగిందని చెప్పారు.ఈ ర్యాలీ జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ ఎక్స్ రోడ్, ఆలంపల్లి, కొత్తగాడి గేట్, వనంపల్లి ఎక్స్ రోడ్, వెల్చాల్, మోరంగపల్లి, మోమిన్ పేట్, మేక వనం పల్లి మార్గాల ద్వారా విజయవంతంగా ముగింపు జరుపుకుని, సంగారెడ్డి జిల్లాకు బయలుదేరనుంది.ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ హనుమంతు రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు మధుసూదన్, వెంకటేశ్వర్ రావు, పిడి లు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.





## ఉత్సాహబరితంగా జోగులాంబ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** జోగులాంబ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ 2024 జిల్లా పోలీస్ కవాత్ మైదానంలో ముగింపు కార్యక్రమం అత్యంత ఉత్సాహబరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జోగులాంబ జోన్ 7 డిఐజి శ్రీ ఎల్ ఎస్ చౌహన్ పాల్గొన్నారు. ఈ మీట్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది తమ తమ ప్రత్యేక పోలీసు విధుల నైపుణ్యాలను ప్రదర్శించారు. వివిధ కేటగిరీలలో ఉన్న పోటీలు నిర్వహించబడినాయి అందులో ముఖ్యంగా

1. సైంటిఫిక్ అయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్ లో ఫారెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, వ్రాత పరీక్ష, ఓరల్ టెస్ట్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్ బిట్స్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్ అండ్ ఓరల్ టెస్ట్, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ ప్రాక్టికల్, పోలీస్ పోర్ట్రెట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, అబ్జర్వేషన్ టెస్ట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్
2. యాంటి సబాటేజ్ చెక్ ఈవెంట్ లో వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సర్చ్, రూమ్ సెర్చ్, యాక్సిస్ కంట్రోల్,
3. కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్ లో కంప్యూటర్ అవేర్నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ,
4. డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్ ఈవెంట్ లో ట్రాకింగ్, ఎక్స్ప్లోజివ్ , నార్కోటిక్స్, సెర్చ్ మరియు పోలీస్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్, పోలీస్ వీడియోగ్రఫీ కాంపిటీషన్ ఈవెంట్స్ నిర్వహించడం జరుగుతుంది.

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, ఈ డ్యూటీ మీట్ ఉద్దేశం పోలీసు అధికారుల మరియు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మరియు సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ ఉపయోగపడుతుందని అలాగే ఒక క్రిమినల్ ను చట్టం నుండి తప్పించుకోకుండా ఉపయోగపడుతుందని అన్నారు ఈ మీట్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రతిభావంతులకు ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ వారికి స్ఫూర్తిని నింపి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో గెలుపొందిన వారిని స్టేట్ మీట్ లో ప్రతిభ కనబరిచిన వారు నేషనల్ మీట్ కి పంపడం జరుగుతుంది అని అన్నారు. ఇక్కడ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్, ట్రోపీలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. డ్యూటీ మీట్లో మహబూబ్ నగర్ జిల్లా అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్షిప్ దక్కించుకున్నది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి జానకి , నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ , వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ , గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు , అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పీ నాగర్ కర్నూల్ రామేశ్వర్, అదనపు ఎస్పీ వనపర్తి రామ్ దాస్ తేజ, ఏఆర్ అదనపు ఎస్పీ నారాయణపేట రియాజ్ ఉల్ హక్, డిఎస్పి టౌన్ వెంకటేశ్వర్లు, డి.ఎస్.పి డిసిఆర్బి రమణారెడ్డి, డి.ఎస్.పి వర్టికల్ సుదర్శన్, డి.ఎస్.పి డి.టి.సి నరసింహులు, డీఎస్పీ గద్వాల్ నరేందర్ రావు, ఏఆర్ డి.ఎస్.పి శ్రీనివాసులు, పోలీస్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు అందజేసే దిశగా సర్వే సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

**వారధి న్యూస్, వికారాబాద్:** ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు అందజేసే దిశగా అధికారులు పనిచేయాలని సెర్ప్ సీఈఓ, జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొంపల్లిలో డిజిటల్ కుటుంబ ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ ప్రజలతో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేయాలనుకుంటున్నందున మున్సిపల్ వార్డులు, గ్రామాల్లోకి వచ్చే అధికారులకు తమ కుటుంబాల సమాచారాన్ని అందించాలన్నారు. ఉమ్మడి కుటుంబాలు విడిగా ఉండాలనుకుంటే, వారు కుటుంబ యజమానిగా వేరుగా డిజిటల్ కార్డు పొందేందుకు వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని సూచించారు.సర్వే బృందాలు గ్రామాల్లో ఉన్నప్పుడు కొన్ని కుటుంబ సభ్యులు అందుబాటులో లేనప్పుడు, డిజిటల్ కార్డు కోసం ఫోటో తీసుకునేందుకు సమయం ఇవ్వాలని అధికారులకు తెలిపారు.ఈ పరిశీలనలో డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఇడియం మహమూద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చెయ్యడం అన్యాయం

- చట్ట సభలో ఇచ్చిన మాటకి విరుద్ధంగా సీఎం వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండిపాటు..
- సిఎం రేవంత్ రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటాం..
- ఈ నెల 9 నాడు జిల్లాలో జరిగే మాదిగల నల్ల జెండాల ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపు.
- ఈనెల 9 రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు ర్యాలీలు రాస్తారోకో విజయంతో చేద్దాం.!
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంట నోళ్ళ నరసింహ మాదిగ
- మద్దిలేటి మాదిగ ఎం ఎస్ పి జాతీయ నాయకులు

**వారధి న్యూస్,షాద్ నగర్:** మంద కృష్ణ మాదిగ ఆదేశం మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఎస్ఎఫ్ మరియు అన్ని అనుబంధ సంఘాల జిల్లా సమావేశం షాద్ నగర్ ఫెంచనర్ భవన్ లో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంట నోళ్ళ నరసింహ మాదిగ, ఎంఎస్పి జాతీయ సీనియర్ నాయకులూ మద్దిలేటి మాదిగ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ అమలు చేయకుండానే డీఎస్సీ ఫలితాలు విడుదల చెయ్యడం అంటే మాదిగలను విస్మరించడమే అవుతుందన్నారు. ఆగస్టు 1 నాడు సుప్రీం కోర్టు వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిన కమిటీల పేరిట కాలయాపన చేస్తూ మాదిగలను వంచిస్తున్నాడు సీఎం రేవంత్ రెడ్డి. తీర్పు వచ్చిన తర్వాత మంద కృష్ణ మాదిగ కంటే ముందు సీఎం రేవంత్ రెడ్డి శాసన సభలో వర్గీకరణ చేసే మొదటి ముఖ్యమంత్రి నేనే అంటే మాదిగలు నమ్మి రెండు నెలలు ఎదురు చూశామని అయిన ఇంకా రేవంత్ రెడ్డి మాదిగలను మోసం చేసే ప్రయత్నం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు.మాదిగలను డీఎస్సీ ఫలితాలలో విస్మరించినందుకు నిరసనగా ఎనాడైతే అక్టోబర్ 9 నాడు డీఎస్సీ ఉద్యోగస్తులకు నియామక పత్రాలు ఇస్తున్నారో అదే రోజు మండల జిల్లా కేంద్రాలలో ర్యాలీలో నల్ల జండాలతో ఆందోళనకరమైన నిరసనలు, ధర్నాలు, మాదిగల నల్ల జెండాల ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయం మీద జిల్లాకు చెందిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పందించాలని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మద్దిలేటి మాదిగ ,ఎమ్మెస్పీ జాతీయ సీనియర్ నాయకులు, గట్టగల్ల ప్రశాంత్ మాదిగా,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పోతుగంట కృష్ణ మాదిగ ,ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి , ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాని భాను ప్రసాద్ మాదిగ ,చిట్టిబాబు మాదిగ,ఎంఎస్పి సీనియర్ నేతలు రత్నం మాదిగ సీనియర్ నాయకులు, కొత్తూరు రమేష్ మాదిగ సీనియర్ నాయకులు తుడుము కిరణ్ మాదిగా,ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చినోళ్ళ అనంతయ్య మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు,కిరణ్ పూలే మాదిగ ,అమర్ పెద్దిన కార్యదర్శి శివ శంకర్ మాదిగా, జిల్లా కార్యదర్శి శ్యంలేట్ గణేష్ మాదిగ, ఐత రమేష్ మాదిగ,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అన్న గల ఆనంద్ మాదిగ, చన్నగల్ల అశోక్ మాదిగ,ఎంఆర్పిఎస్ బొబ్బిలి పాండు మాదిగ,చేవెళ్ల ప్రవీణ్ మాది గా, చేవెళ్ల ప్రెసిడెంట్ తుంట జంగయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ మహేశ్వర మాజీ అధ్యక్షులు కొంగర లక్ష్మయ్య మాదిగ,మహేష్ మదిగా,ఎంఎస్ఎఫ్ శంషాబాద్ ఇంచార్జ్ కాల జంగయ్య మాదిగ,ఇబ్రహీంపట్నం సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పండగలకు ఊరెళ్తున్నారా... జాగ్రత్తలు పాటించండి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా పిల్లలకు సెలవులు ఉండడంతో చాలా మంది తమ సొంత గ్రామాలకు కానీ ఇతర గ్రామాలకు గాని పట్టణాలకు గాని ప్రయాణాలు చేస్తూంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారన్నారు. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రజలకు సూచించారు. పండుగ దృష్యా చోరీల నియంత్రణకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు.ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారు లలో పెట్టడం చేయకూడదన్నారు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేసుకోవాలి ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలి, అపార్ట్మెంట్లకు వాచ్ మెన్ మరియు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సిసి కెమెరాలను ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీమొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంటుంది. ప్రజలు ఇండ్లలోనుండి బయలు దేరె ముందు గ్యాస్ లివర్ తప్పనిసరిగా ఆఫ్ చేసుకోవాలి,షార్ట్ సర్కుట్ కాకుండా జాగ్రతలు పాటించాలి. ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. తమ ప్రాంతం పరిధి లోని పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్ ఇతర అధికారుల నెంబర్ లు ప్రజలు తమ సెల్ ఫోన్ లలో ఉంచుకోవాలి. అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ కు గాని, సంబందిత పోలీస్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి.అలాగే వాహన ప్రయాణాలు చేస్తారు కాబట్టి పలు జాగ్రతలు పాటించాలని మరియు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రతగా వాహనాలను నడుపుతూ ప్రశాంతంగా, క్షేమంగా తమ గమ్య స్థానాలకు చేరుకొని సంతోషకరంగా పండుగను జరుపుకోవాలని ముఖ్యంగా 2 వీలర్ నడిపే వాళ్లు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు.ప్రజలు పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించవచ్చు అని సంతోషకరమైన పండుగ ను ముందస్తూ జాగ్రతలతో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు లేకుండా జరుపుకోవాలని అన్నారు.



## బాలాపూర్ లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

- ముఖ్య అతిథులు సంజయ్ గణాటి, దుద్దాల లక్ష్మీనారాయణ

**వారధి న్యూస్, బాలాపూర్:** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి సంజయ్ గణాటి మరియు అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు ఇంటింటికి తిరిగి ప్రజలను పార్టీలో చేర్చారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ భీమ్ రాజు, ప్రధాన కార్యదర్శి కోడూరు సోమేశ్వర్, ఓబీసీ మోర్చా కోశాధికారి రమేష్, నాయకులు చిల్లంపల్లి రాజశేఖర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సత్యం, నార్సింగ్ ఓబీసీ ఇన్‌చార్జి బిక్షపతి యాదవ్, 182 బూత్ అధ్యక్షుడు రుద్ర వెంకటేష్, 177 బూత్ అధ్యక్షుడు కోట్ల గోపాల్, సత్తయ్య, భాస్కర్ చారి, అరవింద్, అనిల్, మాధవాచారి, దేవానంద్, గణేష్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సత్యనారాయణ రెడ్డి మృతి

- పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ రెడ్డి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** అడ్డకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు చంద్రమోహన్ రెడ్డి తండ్రి, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణ రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి తన అమూల్యమైన సమయాన్ని కేటాయించి, గ్రామ కార్యకర్తలకు మార్గనిర్దేశకుడిగా నిలిచారనీ, ఆయన మరణం బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

* కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

**వారధి న్యూస్, గండిపేట్:** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏడవ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సాయాన్ని తీసుకుంటున్నామని కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆమె, పద్మ శ్రీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, నరసా రెడ్డి కాలనీల ప్రధాన సమస్యలు అయిన డ్రైనేజీ, వాటర్ లైన్, సీసీ రోడ్ల అభివృద్ధి విషయమై ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందించారు.కార్పొరేటర్ పద్మావతి మాట్లాడుతూ, స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించామని, వీటిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే పరిష్కారం చేయాలని కోరామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ ఉమామహేశ్వర్, ఠాకూర్, మస్తాన్, అసోసియేషన్ సభ్యులు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

## బస్తీ అభివృద్ధి కోసం చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి పోటీ



**వారధి న్యూస్, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలిపిస్తే బస్తీని మరింత అభివృద్ధి చేస్తానని చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే సంక్షేమ సంఘ ఎన్నికల సందర్భంగా శుక్రవారం శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం కమిటీ హాల్ లో అడక్ కమిటీ సభ్యులకు నామినేషన్ పత్రాలు సమర్పించి, అభ్యర్థిగా గుర్తింపు పొందారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని, శ్రీధర్ రెడ్డికి మద్దతు తెలిపారు. బస్తీ ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని, శ్రీధర్ రెడ్డికి తమ అమూల్య ఓటును ఇచ్చి అధిక మెజార్టీతో గెలిపిస్తామని పలు వర్గాల నేతలు తీర్మానించారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: కేశిరెడ్డి హన్మంత రెడ్డి, చర్ల రామకృష్ణారెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, దొడ్ల రామిరెడ్డి, ఈరెడ్డి దేవేందర్ రెడ్డి, డాకురీ అక్కిరెడ్డి, మల్లేష్ యాదవ్, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, లావణ్య, కర్ల తిరుపతి రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మహేందర్ రెడ్డి, సాయిబాబా, బాలశౌరి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ చారి, రఘు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పట్టణంలో వ్యభిచార ముఠాపై దాడి

- టాస్క్ ఫోర్స్, వన్ టౌన్ పోలీసులు అదుపులోకి నలుగురు విటులు, ఒక మహిళ



**వారధి న్యూస్, సిద్దిపేట:** సిద్దిపేట పట్టణం శివాజీ నగర్ లోని చంద్రమౌళి ఇంటిలో వ్యభిచారం నడిపిస్తున్నాడని సమాచారం ఆధారంగా సిద్దిపేట టాస్క్ ఫోర్స్ మరియు వన్ టౌన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు విటులు బూర శ్రీనివాస్ (ప్రభుత్వ టీచర్), మోతె వెంకటేష్, కొత్తపల్లి శంకర్, మిద్దె ప్రసాద్, సహా ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడిగా ఉన్న హోమియోపతి డాక్టర్ చంద్రమౌళి పరారీలో ఉన్నట్లు తెలిపారు.పోలీసులు వీరి వద్ద నుండి 2000/ రూపాయలు నగదు, కండోమ్స్, 6 సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లాలో ఏప్రకారమైన సంఘ వ్యతిరేక కార్యక్రమాలు, జూదం, పేకాట, వ్యభిచారం, అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పక్కా సమాచారముంటే, వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట టాస్క్ ఫోర్స్ నెంబర్ల 8712667445, 8712667446, 8712667447 కు ఫిర్యాదు చేయవచ్చని, సమాచార దాతల వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

Movie Time మూవీ టైమ్

# 2025 క్రిస్మస్ కి ఆలియాభట్, శార్వరి ...ఆల్ఫా



యష్‌రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న స్పై యూనివర్స్ మూవీ 'ఆల్ఫా'. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆలియాభట్ టైటిల్ పాత్రలో కనిపిస్తారు. ఆమెతో పాటు శార్వరి సినిమాలో కీ రోల్ చేస్తున్నారు. యష్‌రాజ్ ఫిల్మ్స్ హోమ్ గ్రోన్ టాలెంట్‌గా పేరు తెచ్చుకున్నారు శార్వరి. ఆల్ఫాలో ఆలియా, శార్వరి ఇద్దరూ సూపర్ ఏజెంట్స్ గా నటిస్తున్నారు. పక్కా స్పై వర్స్ లో రూపొందుతోంది ఆల్ఫా. శివ్ రావెల్ దర్శకత్వ ప్రతిభకు ఈ సినిమా అద్దం పడుతుందంటున్నారు మేకర్స్. ఆల్ఫా వచ్చే ఏడాది క్రిస్మస్‌కి పక్కా హాలిడే ట్రీట్ అని అంటున్నారు మేకర్స్. ఈ సినిమాను అత్యంత భారీ చిత్రంగా తెరకెక్కించడానికి అన్ని విధాలా ఆదిత్య చోప్రా కృషి చేస్తున్నారు. బిగ్ స్క్రీన్ స్పెక్టకిల్ అనే పదానికి సిసలైన అర్థం ఎలా ఉంటుందో చూపించనుందీ సినిమా. స్టన్నింగ్ విజువల్స్, అడ్రినలిన్ పంపింగ్ సీక్వెన్సులు, ఇంటెన్స్ యాక్షన్స్, అన్ ఎక్స్ పెక్టెడ్ ట్విస్టులతో అద్భుతంగా రూపొందుతోంది ఆల్ఫా.



## అత్యంత వైభవంగా మొదలైన దళపతి 69

విజయ్ సినిమా కెరీర్‌లో ఆఖరి చిత్రం దళపతి 69ని అత్యంత వైభవంగా ప్రారంభించింది కేవీయన్ ప్రొడక్షన్స్. పూజా కార్యక్రమాలతో భారీ సినిమాకు కొబ్బరికాయ కొట్టేశారు. నవరాత్రుల్లో రెండో రోజున ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలు కావడం ఆనందంగా ఉందంటున్నారు మేకర్స్. సినిమాలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల సమక్షంలో ఆత్మీయంగా జరిగింది దళపతి 69 మూవీ పూజ. శనివారం నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. దళపతి కెరీర్‌లో హిస్టారిక్ ప్రాజెక్ట్ ఇది. సిల్వర్‌స్క్రీన్ మీద ఆయన చివరిసారిగా కనిపించనున్న చిత్రం ఇదే. దళపతి ఫ్యాన్స్ కి ఇదొక ఎమోషనల్ ప్రాజెక్ట్. విజయ్ సరసన ఈ చిత్రంలో పూజా హెగ్డే నాయికగా నటిస్తున్నారు. బాబీ డియోల్ కీలక పాత్రలో కనిపిస్తారు. గౌతమ్ వాసుదేవ మీనన్, నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్ట్రెస్ ప్రియమణి, వెటరన్ యాక్టర్ ప్రకాష్ రాజ్, రెయిజింగ్ స్టార్ మమిత బైజు ప్రధాన పాత్రల్లో మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. కేవీయన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా వెండితెరమీద విలక్షణమైన నటనతో బాక్సాఫీస్‌ని షేక్ చేస్తున్న విజయ్ కెరీర్‌లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న సినిమా ఇది. అనిరుద్ సంగీతం అందిస్తున్నారు. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తారు. ప్రదీప్ ఇ రాఘవ్ ఈ సినిమాకు ఎడిటింగ్ విభాగాన్ని హ్యాండిల్ చేస్తున్నారు. అనల్ అరసు యాక్షన్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు. సెల్వ కుమార్ ఆర్ట్ డైరక్టర్‌గా పనిచేస్తున్నారు. పల్లవి సింగ్ కాస్ట్యూమ్స్ విభాగాన్ని హ్యాండిల్ చేస్తున్నారు. 'ధీరన్ అదిగారమ్ ఒండ్రు', 'మాస్టర్' సినిమాలకు పనిచేసిన సత్యన్ సూర్యన్.. దళపతి 69 ని మరో రేంజ్‌లో చూపిస్తారనే కాన్ఫిడెన్స్ ఆల్రెడీ ప్రేక్షకుల్లో క్రియేట్ అయింది. ప్యాన్ ఇండియా రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. తమిళ్, తెలుగు, హిందీలో 2025 అక్టోబర్‌లో విడుదల కానుంది ఈ సినిమా. విజయ్ లెగసీని దృష్టిలో పెట్టుకుని, ఆయన నటిస్తున్న చివరి సినిమాను అత్యంత భారీగా, తరాలు గుర్తుపెట్టుకునేలా తెరకెక్కించే పనిలో ఉన్నారు మేకర్స్.



## 'విశ్వం' థర్డ్ సింగిల్ వస్తాను వస్తానులే సాంగ్ రిలీజ్

మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ 'విశ్వం'. రీసెంట్ గా రిలీజైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు మరింతగా పెంచింది. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ 'మొరాకో మగువా', సెకెండ్ సింగిల్ 'మొండి తల్లి పిల్ల నువ్వు' సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. మేకర్స్ ఈ రోజు థర్డ్ సింగిల్ వస్తాను వస్తానులే సాంగ్ రిలీజ్ చేశారు. చేతన్ భరద్వాజ్ లవ్లీ రొమాంటిక్ నంబర్ గా ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ గా కంపోజ్ చేశారు. వెంగి రాసిన లిరిక్స్ లీడ్ పెయిర్ కెమిస్ట్రీని చాలా లవ్లీగా ప్రజెంట్ చేశాయి. కపిల్ కపిలన్ తన గ్రేస్ ఫుల్ వోకల్స్ తో కట్టిపడేశారు. ఈ సాంగ్ లో గోపీచంద్, కావ్యా థాపర్ కెమిస్ట్రీ మెస్మరైజింగా వుంది. ఫారిన్, బీచ్ ల్యాండ్ స్కేప్ లో షూట్ చేసిన ఈ సాంగ్ లో విజువల్స్ అద్భుతంగా వున్నాయి. థియేటర్స్ లో ఈ సాంగ్ ఐఫీస్ట్ లా వుండబోతోంది.